క్లుప్తంగా

అధికారులు సమాచారం ఇవ్వాలి

జూలూరుపాడు: సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన సమాచారాన్ని అధికారులు తక్షణమే ఇవ్వాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అవసరమైన సమాచారాన్ని ఆర్టీఐ చట్టం ద్వారా అధికారులను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతోపాటు, ఇదిగో అదిగో కాలయాపన చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమాచారం ఇవ్వాలని, లేని పక్షంలో మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఎదుట నిరహార దీక్ష చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు.

డీజీఎం (పర్సనల్)కు సన్మానం



మోహన్‌రావును సత్కరిస్తున్న అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావును సింగరేణి అధికారులతో కలిసి జీఎం వీసం కృష్ణయ్య ఘనంగా సత్కరించారు. ఆదివారం ఇల్లెందు జీఎం చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోహన్‌రావును శాలువ, పూలమాలలు, గిఫ్ట్ అందజేసి సత్కరించారు. నాలుగేళ్లు ఇల్లెందు ఏరియాలో డీజీఎం పర్సనల్‌గా పని చేసి బదిలీపై వెళ్తున్న మోహన్‌రావు సేవలు అందరికీ గుర్తుంటాయని జీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రామస్వామి, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న అడ్వయిజర్ (లీగల్) కాంట్రాక్ట్ బేస్ ఉద్యోగానికి రెండు సంవత్సరాల కాలపరిమితికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను **httpr:www.rccmier.com** వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మైనార్టీ పాఠశాల, కళాశాలలో..

పాల్వంచ: పాల్వంచలోని నవభారత్ రాజీవ్‌నగర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాలతో పాటు ఖాళీగా ఉన్న 6, 7, 8 తరగతుల్లో సీట్ల భర్తీ కోసం ముస్లిం మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని, వివరాలకు 7995057881, 9502547451 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కులగణనలో ముస్లింలకు అన్యాయం



మాట్లాడుతున్న యాకూబ్‌పాషా

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం గతేడాది చేపట్టిన కులగణన సర్వేలో ముస్లిం జనాభా గణాంకాల్లో తీవ్ర అవకతవకలు జరిగాయని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా ఆరోపించారు. ఆదివారం కొత్తగూడెంలో ఆయన మాట్లాడారు. 2011లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన ప్రకారం తెలంగాణలో ముస్లిం జనాభా 44,64,852 ఉండగా, 2024లో రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో 44,57,012గా చూపించారన్నారు. 13 సంవత్సరాల్లో జనాభా పెరగకపోగా, తగ్గినట్లు గణాంకాలు చూపడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తప్పిదాలను కప్పిపుచ్చేందుకు సర్వే వివరాలను బహిర్గతం చేయడం లేదన్నారు. దీనివలన స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లింలకు రిజర్వేషన్ సీట్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, తగ్గిన ముస్లిం జనాభా గణాంకాలపై సమాధానం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. హుస్సేన్ ఖాన్, సలీం, ఆసిఫ్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ–2 ఓసీలో అడిషినల్ జనరల్ మేనేజర్ తాడబోయిన శ్రీనివాస్‌ను హైదబాద్‌లోని సింగరేణి భవన్‌లో మార్కెటింగ్ మూమెంట్ హెచ్ఓడీ బదిలీ చేస్తూ శనివారం రాత్రి సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే సీఎండీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని పేర్కొంది.

వరుణుడి దోబూచులాట

మబ్బులు కమ్ముకుంటున్నాయి.. మేఘాలు ఊరిస్తున్నాయి.. వాతావరణం చల్లబడుతోంది.. కానీ చినుకు మాత్రం నేల జారడం లేదు. వర్షాలు కురుస్తాయనే భరోసాతో నీటివనరులు ఉన్న ప్రాంతాల్లో విత్తనాలు వేసిన రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరికొందరు రైతులు దుక్కులు దున్ని విత్తుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

- తొలకరికే విత్తనాలు వేసుకున్న రైతులు
- మొలకశాతం తగ్గడంతో ఆందోళన
- ఆకాశం వైపు ఆశగా చూస్తున్న అన్నదాతలు



విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

ఇల్లెందురూరల్: జూన్ మొదటి వారంలో ఆశాజనకంగా వర్షాలు కురిసినప్పటికీ నేలలో తేమశాతం మాత్రం కనీస స్థాయికి చేరలేదు. నైరుతి రుతుపవనాల వల్ల ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతున్నాయి. సాయంత్రం మబ్బులు దోబూచులాడుతున్నాయి. ఇలా వెనువెంటనే మారుతున్న వాతావరణ పరిస్థితులపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధిక విస్తీర్ణం వర్షాధారమే..

మండలంలో ప్రస్తుత వానాకాలంలో సుమారు 50వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. చెప్పుకోవడానికి 100 ఎకరాలకు సాగునీరు అందించే చెరువులు లేకపోవడం, వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించకపోవడం వంటి కారణాలతో మండలంలో 70 శాతం సాగు విస్తీర్ణం వర్షాధారమే. అత్యధిక విస్తీర్ణం ఆకాశపాయ పంటలే. కొన్నిచోట్ల బోర్లు, బావుల కింద సాగు చేస్తుంటారు. చెరువులు, కుంటల కింద సుమారు 5వేల ఎకరాలలో మాత్రమే పంటలు అది కూడా అధిక విస్తీర్ణంలో వరి సాగవుతోంది. ఇటువంటి పరిస్థితిలో వర్షాలు అనుకూలంగా కురిస్తేనే .. పంటలు పండే అవకాశం ఉంది.

వదలిపోతున్న మొలకలు..

ప్రస్తుత వానాకాలంలో ఇప్పటికే కొంతమంది రైతులు దుక్కులు సిద్ధం చేసుకొని విత్తన కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. మరికొంత మంది తొలకరి వర్షాలు కురిసిన వెంటనే విత్తనాలు విత్తుకున్నారు. జూన్ ప్రారంభంలో వర్షాలు ఆశాజనకంగా కురవడంతో సుమారు 60 శాతం మేర పత్తి విత్తనాలు విత్తుకున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఎరువులు వేసి విత్తుకున్న తరువాత ఆశించిన స్థాయిలో వర్షం పడకపోతే భూమిలోనే విత్తనాలు మురిగిపోయే అవకాశం ఉంది. ఇక ఇప్పుడిప్పుడే మొలకెత్తిన మొలకలు ఎండవేడిమికి వడలిపోతున్నాయి. దీంతో రైతులు వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

తేమశాతం అనుకూలంగా ఉంటేనే..

సాధారణగా భూమిలో తేమ శాతం అనుకూలంగా ఉన్నప్పుడే విత్తుకుంటే విత్తనం మొలకెత్తే అవకాశం ఉంది. ఒకటి, రెండు వర్షాలు కురియగానే విత్తుకుంటే ఆ తరువాత వర్షం కురవకుంటే విత్తు భూమిలోనే ఎండిపోయే ప్రమాదం లేకపోలేదు. నల్లరేగడి నేలలో 60 నుంచి 70 మి.మీ, ఎర్ర నేలల్లో అయితే 40 నుంచి 50 మి.మీ వర్షపాతం నమోదయితేనే విత్తనాలు విత్తుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. భూమిలో తేమ 50 నుంచి 75 శాతం ఉంటే విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుందంటున్నారు. వానాకాలం పంటలు ఆలస్యమైనా జూలై 15లోగా విత్తుకోవడానికి అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా వాతావరణం మేఘావృతమై ఉండటంతో వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు ఉన్నారు. అదును దాటితే ఆశించిన దిగుబడులు రావని ఆందోళన చెందుతున్నారు.



పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

పొడినేలల్లో విత్తుకోవద్దు..



తొలకరితోపాటు రెండు పెద్ద వర్షాలు కురిశాకే విత్తనాలు విత్తుకోవాలి. భూమిలో విత్తనం వేసిన వారం రోజుల పాటు లోపలి వేడిని తట్టుకోలేదు. ఆ తరువాత వేడితో స్వభావం మారి మొలకెత్తే శాతం తగ్గిపోతుంది. చిన్నపాటి జల్లులు కురిసినా విత్తనం మురిగిపోతుంది. నేలలో తేమ శాతం తగు మోతాదులో ఉన్నప్పుడే విత్తుకోవాలి.

– సతీష్, ఏఓ, ఇల్లెందు

బస్సు షెల్టర్ల నిర్మాణం అభినందనీయం



బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

చుంచుపల్లి: వివిధ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం భద్రాద్రి యాడ్స్ సంస్థ స్వచ్ఛందంగా బస్సు షెల్టర్లను నిర్మించి ప్రజలకు అంకితం చేయడం అభినందనీయమని, ఈ సంస్థను ఆదర్శంగా తీసుకొని ఇతర సంస్థలు, ఆర్థిక స్థోమత ఉన్నవారు తమ సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చాతకొండ క్రాస్ రోడ్డు, ఇల్లెందు, పాల్వంచ క్రాస్ రోడ్డులో భద్రాద్రి యాడ్స్ సంస్థ నిర్మించిన మూడు బస్సు షెల్టర్లను ఆదివారం కూనంనేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి వారికి నీడ కల్పించాలనే ఉద్దేశంతో బస్సు షెల్టర్లను నిర్మించారని, వీటి నిర్వహణ గ్రామపంచాయతీలకు, అధికారులకుంటుందన్నారు. నియోజకవర్గంలోని 13 ప్రధాన సెంటర్లలో బస్సు షెల్టర్ల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని, త్వరలో నిర్మాణాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కే సాబీర్‌పాషా, కొత్తగూడెం ఆర్టీసీడిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, ఎంపీడీఓ అంకుబాబు, ప్రొఫెసర్ పూర్ణచందర్‌రావు, విద్యుత్ శాఖ ఏఈ రఘురామయ్య పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి..

కొత్తగూడెంఅర్బన్: నియోజకవర్గంలోని ప్రతీ ప్రభుత్వ విద్యా సంస్థ, వసతి గృహాలలో అన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థులు, వైద్యసిబ్బంది ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేస్తున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో శ్రీ రామ చంద్ర డిగ్రీ కళాశాలలో రూ.35లక్షల పంచాయతీరాజ్ నిధులతో చేపట్టనున్న భవనాల మరమ్మతు పనులకు ఆదివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): అత్యవసర పరిస్థితులలో సొంత ఖర్చులతో ప్రైవేట్ ఆస్పత్రులలో వైద్యం చేయించుకున్న పేదవర్గాలకు ప్రభుత్వం ద్వారా అందించే ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని ప్రతీఒక్కరు అందుకునే విధంగా సులభతరం చేయాలని, పథకం అమలులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. సీఎం సహాయనిధి పథకానికి దరఖాస్తు చేసుకున్న 84 మంది లబ్ధిదారులకు రూ.32.25 లక్షల విలువైన చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్కే సాబీర్‌పాషా, వాసిరెడ్డి మురళి, వి.పూర్ణచందర్‌రావు, కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, యూసుఫ్, ధర్మరాజు, రామారావు, అప్పారావు పాల్గొన్నారు.

సుజాతనగర్: స్థానిక తహసీల్‌లో 33 మంది కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, ఎంపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి టీయూసీఐ మహాసభలు



మాట్లాడుతున్న యాకూబ్‌షావలీ

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 21, 22 తేదీలలో నిజామాబాద్‌లో జరగనున్న టీయూసీఐ మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్‌షావలీ పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెంలోని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యాలయంలో జరిగిన రీజియన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013లో కుదిరిన హైపవర్ వేతనాలు, 2018లో కనీస వేతనాలు అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికుల ఓట్లు దండుకునేందుకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా జీతాల పెంపుపై ప్రకటన చేయకపోవటం ఆనాడు కేసీఆర్, ఈనాటి రేవంత్ రెడ్డి మాటలు వట్టి మాటలేనని రుజువు చేసుకుంటున్నారన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికులకు హక్కులు లేకుండానే చట్టాలు మార్చిందన్నారు. రాష్ట్రంలో కేంద్రంలో కార్మిక వ్యతిరేక పాలన కొనసాగుతోందని వారు మండిపడ్డారు. ఈ సమావేశంలో అమర్లపూడి శరత్, పెద్దబోయిన సతీష్, ఆర్.మధుసూదన్‌రావు, చంద్రశేఖర్, జానయ్య, సంజీవరెడ్డి, శంకర్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న ఇందిరా పార్క్ వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని కొత్త బస్టాండ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. దట్టమైన అడవుల్లో ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అదివాసీలను, మావోయిస్టులను హతమారుస్తున్నారని నాయకులు ఆరోపించిరు. ఎండీ రాసుద్దీన్, కె.సారంగపాణి, కె.శ్రీనివాస్, రాజు, దేవరకొండ శంకర్, నాగయ్య, కృష్ణ, మోహన్‌రావు, చాందావత్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరుతూ శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17న హైదారబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ నేత వాంకుడోత్ మోతీలాల్ కోరారు. ఈ మేరకు పోచారంతండా గ్రామంలో ఆదివారం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. వాంకుడోత్ శ్రీను, తుడుం శ్రీను, రాజాలు, భూక్యా లక్ష్మ, కిషన్, మల్సూర్, రాజు, వెంకట్రాం పాల్గొన్నారు.

నేడు రైతు నేస్తం

పాల్వంచరూరల్: జగన్నాథపురం, పాండురంగాపురం, పాయకారియానంబైల్ గ్రామాల్లోని రైతు వేదికల్లో సోమవారం సాయంత్రం 4గంటలకు రైతు నేస్తం కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయశాఖాధికారి శంభోశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడతారని, రైతులు హాజరు కావాలని కోరారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక

జూలూరుపాడు: హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఈనెల 18న జూలూరుపాడు హైస్కూల్‌లో మండల స్థాయి సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరానికి 4వ తరగతి ప్రవేశానికి విద్యార్థినీ, విద్యార్థులను ఎంపిక చేసేందుకు పలు క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు గుర్తించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు.

టేకులపల్లి: హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలోని స్పోర్ట్స్ స్కూళ్లలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను నాలుగో తరగతిలో ప్రవేశాలకు అర్హులైన బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని టేకులపల్లి మండల విద్యాశాఖ అధికారి అజ్మీర జగన్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

లోక్ అదాలత్‌లో 5,278 కేసుల పరిష్కారం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 5,278 కేసులు పరిష్కారం అయినట్లు జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ ఇన్వెస్టిగేషన్, కోర్టులో విచారణలో ఉన్న కేసులు (803), డంక్ అండ్ డ్రైవ్, ఎంవీ యాక్టు కేసులు, నిబంధనలు ఉల్లంఘించిన కేసులు (4009), ఈ పిటీ కేసులు, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన తదితర కేసులు (466) మొత్తం 5,278 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది గత వారం రోజుల నుంచి కేసులలో ఉన్న కక్షిదారులను స్వయంగా కలిసి రాజీమార్గం రాజమార్గమని లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలకు సత్వర న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించినందుకు ఈ కేసులు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి ప్రతిభ చూపిన అధికారులు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లకు రివార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. దీనిలో భాగంగానే జిల్లాలో నమోదైన 226 సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించి, ఈ కేసులలో నగదు కోల్పోయిన బాధితులకు రూ.60,11,992 నగదును కోర్టు ద్వారా అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

కన్వేయన్స్ డ్రైవర్లకు హక్కులు కల్పించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రైవేట్ కన్వేయన్స్ డ్రైవర్లకు చట్టబద్ధ హక్కులను కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగిన కన్వేయన్స్ డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ... సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేట్ కన్వేయన్స్ డ్రైవర్లకు పని ఆధారంగా వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో జీఓ ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నట్లుగా లెక్కలలో చూపించి వాస్తవంగా పూర్తి వేతనాలు డ్రైవర్లకు చెల్లించడం లేదని, దీనివల్ల నెలకు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు నష్టపోతున్నట్లు చెప్పారు. ప్రతీనెల 7వ తేదీ లోపు అందాల్సిన జీతాలు 15 తర్వాతనే చెల్లిస్తున్నారని, ఉద్యోగ భద్రతలేక తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు జే.మధు, ఈ.ప్రవీణ్, ఏ.లక్ష్మీనారాయణ, ధన్‌రాజ్, రంజిత్, యూసఫ్, విష్ణు, భవాని, ప్రసాద్ పాల్గొన్నారు.

సీబీఎస్ఈ సిలబస్‌ను రాజకీయం చేయకండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ సెక్టార్–2 పాఠశాలలో తాజాగా ఏర్పాటు చేసే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిలబస్ విషయంలో రాజకీయం చేయవద్దని 80శాతం కార్మికుల, 20 శాతం బయటి పిల్లలకు స్కీమ్‌ను అమలు చేయరాదని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇటీవల సీబీఎస్ఈ సిలబస్ ప్రారంభోత్సవ కార్యక్రమం రాజకీయం జోక్యం కారణంగా వాయిదా పడిందని, కార్మికుల పిల్లలకు నాణ్యమైన చదువును అందించాలని కంపెనీ ఉన్నతాధికారులతో ప్రారంభించాల్సిన కార్యక్రమంలో రాజకీయ జోక్యం గర్హనీయం అని పేర్కొన్నారు. అదేవిధంగా క్వాలిఫైడ్ టీచర్లను అపాయింట్‌మెంట్ చేయాలని, అధికారుల భార్యలను టీచర్లుగా తీసుకోవటం వలన సింగరేణి ఎడ్యుకేషన్ అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. ఫైలాన్‌లో యూనియన్ పేరు చిన్నగా ఉందని ఏఐటీయూసీ నాయకులు చెప్పటం సిగ్గుచేటని తెలిపారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత



ఉత్తర్వులు అందజేస్తున్న జీఎం కృష్ణయ్య

ఇలెందు: ఇల్లెందు ఏరియా సింగరేణిలో విధులు నిర్వహిస్తూ మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల వారసులకు ఆదివారం జీఎం కార్యాలయంలో జీఎం వీసం కృష్ణయ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. మాట్లాడుతూ... సింగరేణిలో ఉద్యోగం రావటం అదృష్టంగా భావించాలని కోరారు. భూగర్భ గనుల్లో పనిచేస్తూ నైపుణ్యం పెంచుకోవాలని కోరారు. పని ప్రదేశంలో రక్షణతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సింగరేణిలో ఉద్యోగాలు వారసత్వంగా అందించిన తల్లిదండ్రులను కుటుంబాన్ని పోషించాలని సూచించారు. రామగుండం–1 ఏరియాలో భూగర్భ గనిలో పని చేయుటకు నియామక ఉత్తర్వులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రామస్వామి, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, యూనియన్ నాయకులు యాదగిరి, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమం, ప్రభుత్వాస్పత్రుల్లో పాలు, పండ్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. నాయకులు మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిరంతరం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని, సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రజలకు అందించడంలో కీలకపాత్ర వహిస్తున్నారని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంఅర్బన్: ఎదురుగడ్డ గ్రామంలో కేక్ కట్ చేస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



ఇల్లెందు: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వానొస్తే అవస్థలే..

- గరీభ్‌పేట – లక్ష్మీదేవిపల్లి గ్రామాల మధ్య వాగు
- వంతెన నిర్మాణం కోసం ఎదురుచూపు



ప్రమాదకరంగా వరదను దాటుతున్న స్థానికులు (ఇన్‌సెట్) చప్టాపై నుంచి ప్రవహిస్తున్న వరద (ఫైల్)

సుజాతనగర్: లక్ష్మీదేవిపల్లి, గరీభ్‌పేట గ్రామాల మధ్యలో ప్రవహిస్తోన్న వాగు ప్రతీ వర్షాకాలంలో ప్రయాణికులు, గ్రామస్తులను ఇబ్బందులకు గురిచేస్తోంది. చిన్నపాటి వర్షం కురిసినా నీరు పారుతోంది. దీంతో ప్రాణాలకు తెగించి వరద ప్రవాహంలోనే ప్రయాణాలు చేయడం లేదా రాకపోకలు నిలిచిపోవడం జరుగుతోంది. ఏళ్లుగా ఈ సమస్య వేధిస్తున్నా అధికారులు, పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ వాగుపై చప్టా స్థానంలో వంతెన నిర్మిస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వరద వస్తే ఎక్కడివారు అక్కడే..

ఓ మోస్తరు వర్షం కురిస్తే చాలు ఈ కాలువ పారుతోంది. ఎగువన ఉన్న గరీభ్‌పేట, నిమ్మలగూడెం తదితర ప్రాంతాల నుంచి వచ్చే వరద ఈ వాగు గుండానే వెళ్లాలి. దీంతో ఆ దారిలో ప్రయాణించే వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతోపాటు కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. అటువైపు ఉన్న గ్రామ ప్రజలు ఇటువైపు.. ఇటువైపు ఉన్నవారు అటువైపు.. వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చుట్టూ తిరిగి వెళ్లాలి..

లక్ష్మీదేవిపల్లి గ్రామ ప్రజలలో కొందరు తమ పంట పొలాలకు వెళ్లాలంటే ఈ వాగు మీద నిర్మించిన చప్టా పైనుంచే వెళ్లాలి. వర్షాకాలం పంట పొలాలకు వెళ్లాలన్నా, వ్యవసాయ సామగ్రి తరలించాలన్నా రైతులు అవస్థలకు పడుతున్నారు. గరీభ్‌పేట గ్రామస్తులు మండల కేంద్రం సుజాతనగర్ రావాలంటే ఈ రహదారి గుండా వస్తే తక్కువ దూరం కావడంతో నిత్యం వాహనాలు ఇలానే వస్తుంటాయి. ప్రతీ వర్షాకాలంలోనూ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వాగుపై వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మించాలి..

వరద అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు చొరవ తీసుకుని ఈ వాగుపై వంతెన నిర్మించి శాశ్వత పరిష్కారం చూపితేనే ఆయా గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుంది. జిల్లా, మండల అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మాణం చేపడితే లక్ష్మీదేవిపల్లి, గరీభ్‌పేట గ్రామస్తులతోపాటు ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వర్షాకాలంలో రవాణా కష్టాలు తీరుతాయి.


వంతెన నిర్మించాలి...



వర్షాకాలంలో వాగు వస్తే వరద తగ్గేంత వరకూ ఆగాల్సి వస్తోంది. గతంలో ఒకరు వరద ప్రవాహంలో కొట్టుకొనిపోగా ప్రాణాలకు తెగించి కాపాడాం. వరద వచ్చిన సమయంలో పశువులు, గొర్రెలు, మేకలు కొట్టుకొని పోతున్నాయి.

– బానోత్ నరేష్, లక్ష్మీదేవిపల్లి

వర్షం వస్తే రాకపోకలు బంద్..



ఏ పాటి కొద్దిపాటి వర్షం కురిసినా చప్టాపై నుంచి వరద నీరు ప్రవహిస్తుంది. వరద ప్రవాహం తగ్గేంత వరకు ప్రయాణాలను ఆపుకోవాల్సిన పరిస్థితి నెలకుంటుంది. వాగు దాటి పొలాలకు వెళ్లాల్సిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– కున్సోత్ పరుశురాం, లక్ష్మీదేవిపల్లి